సంక్రాంతి ముగ్గుల పోటీలు



ముగ్గుల పోటీల్లో విజేతలకు నగదు బహుమతి అందజేస్తూ..

కీసర: సంక్రాంతి పండగను పురస్కరించుకొని నాగారం మున్సిపాలిటీ పరిధిలోని 15వ వార్డులో కౌన్సిలర్ మాదిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం ముగ్గుల పోటీలను నిర్వహించారు. చక్కటి ముగ్గులను వేసిన మహిళలకు మొదటి బహుమతికి కింద రూ.5 వేలు, ద్వితీయ బహుమతి కింద రూ.3 వేలు, తృతీయ బహుమతి కింద రూ.1,500 నగదు బహుమతి అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మాదిరెడ్డి స్వప్న, కో ఆప్షన్ సభ్యుడు షఫీ, కాలనీ అధ్యక్షుడు ప్రవీణ్, సెక్రటరీ, శ్రావన్, ఎన్‌జీకే మూర్తి, వెంకట్, ఖాజా, మాజీ వార్డు సభ్యుడు సత్యంసాగర్, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం



సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తూ..

కీసర: నాగారం మున్సిపాలిటీ పరిధిలోని వివిధ వార్డుల్లో మున్సిపల్ నిధులు వెచ్చించి వివిధ అభివృద్ధి పనులు చేపడతామని మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు. మున్సిపల్ పరిధిలోని 19వ వార్డు ఓల్డ్ విలేజ్‌లో రూ.10 లక్షల మున్సిపల్ నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరి సహకారంతో నాగారం మున్సిపాలిటీని ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. వైస్‌చైర్మన్ బండారి మల్లేషయాదవ్, కౌన్సిలర్ సుర్వీ శ్రీనివాస్‌గౌడ్, నాయకులు కౌకుట్ల కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేతలు



చీర్యాల రెవెన్యూ పరిధిలో అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తూ..

కీసర: కీసర మండల రెవెన్యూ పరిధిలో ప్రభుత్వ, అసైన్డ్ స్థలాల్లో అక్రమ నిర్మాణాల కూల్చివేతలు కొనసాగుతూనే ఉన్నాయి. కీసర తహసీల్దార్ అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో చీర్యాల గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 58, 59లో ప్రభుత్వ, అసైన్డ్ స్థలాల్లో వెలసిన అక్రమ నిర్మాణాలను బుధవారం జేబీసీతో రెవెన్యూ సిబ్బంది కూల్చివేయించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ అశోక్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ, అసైన్డ్ స్థలాల్లో అక్రమ నిర్మాణాలు చేపట్టితే చట్టరీత్యా సదరు వ్యక్తులపై చర్యలు తప్పవన్నారు. ఆర్ఐ కిషోర్, పోలీస్ సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



శామీర్‌పేట మినీ స్టేడియంలో క్రీడా పోటీలు

శామీర్‌పేట్: క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని శామీర్‌పేట ఎంపీపీ ఎల్లుబాయి అన్నారు. షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో మేడ్చల్ జిల్లా క్రీడోత్సవాల్లో భాగంగా జిల్లాలోని వసతిగృహం(హాస్టల్) విద్యార్థులకు బుధవారం శామీర్‌పేట మినీ స్టేడియంలో క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సీ బాలుర, ఎస్సీ బాలికల వసతిగృహాల విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, లాంగ్‌జంప్, షాట్‌పుట్, రన్నింగ్ వంటి క్రీడాపోటీల్లో మొదటి, రెండవ స్థానాల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. స్థానిక సర్పంచ్ బాలమణి, జెడ్పీటీసీ అనిత, జిల్లా, మండల స్థాయి, క్రీడా ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తూంకుంట స్కూల్‌లో తరగతి గదులు ప్రారంభం



తరగతి గదులను ప్రారంభిస్తూ..

శామీర్‌పేట్: సికింద్రాబాద్ ట్విన్ ఏరియా టేబల్ 148 సభ్యుల సహకారంతో మేడ్చల్ జిల్లా తూంకుంట మున్సిపాలిటీ జెడ్పీ ఉన్నత పాఠశాలలో రూ.17.5 లక్షలతో వెయ్యి చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మించారు. కాగా బుధవారం ట్విన్ ఏరియా టేబల్ 148 చైర్మన్ ఆదర్శ్‌కుమార్ కాచమ్, జితేందర్‌సింగ్ చుగ్ తరగతి గదులను ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ కన్వీనర్ రాహుల్‌కనుపా రౌండ్, ఎంఈఓ వసంతకుమారి, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రావల్‌కోల్‌లో రోడ్డు కోసం వినతి



వినతి పత్రం అందజేస్తున్న గిరిజనులు

మేడ్చల్: మండలంలోని రావల్‌కోల్ గ్రామంలో రోడ్డు నిర్మాణం కోసం మండల పరిషత్ కార్యాలయంలో గ్రామస్తులు వినతి పత్రం అందజేశారు. గ్రామంలోని జీవన్‌రెడ్డి తోట నుంచి దొంగలగుట్ట తండా వరకు రోడ్డు సరిగా లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. అధికారులు వెంటనే పట్టించుకుని రోడ్డు నిర్మాణం చేయాలని కోరారు. వినతి పత్రం అందజేసిన వారిలో సీపీఎం మండల కార్యదర్శి నరేష్, తండావాసులు శారద, సుజాత, కమల, వంశీ తదితరులు ఉన్నారు.

సంస్కృతి టౌన్‌షిప్‌కు బస్ సర్వీస్



బస్ సర్వీసును ప్రారంభిస్తున్న కౌన్సిలర్ హరిప్రసాదరావు

పోచారం: మున్సిపాలిటీ పరిధిలోని సంస్కృతి టౌన్‌షిప్ నుంచి ఉప్పల్, సికింద్రాబాద్ ప్రాంతాలకు టీఎస్ఆర్టీసీ నూతన బస్ సర్వీసును కౌన్సిలర్ జెజ్జంకి హరిప్రసాదరావు ఆధ్వర్యంలో బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా హరిప్రసాద్ మాట్లాడుతూ.. సంస్కృతి టౌన్‌షిప్ నుంచి బస్సులు ప్రతిరోజూ 10 నుంచి 12 ట్రిప్పులు తిరుగుతాయన్నారు. టౌన్‌షిప్‌కు బస్సు సౌకర్యం రావడంతో కాలనీవాసులు సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టౌన్‌షిప్ ఫ్లాట్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు, సీనియర్ సిటిజన్స్, కాలనీవాసులు పాల్గొన్నారు.

అవిశ్వాస రాగం..

ఘట్‌కేసర్ చైర్ పర్సన్, వైస్ చైర్మన్ పదవులకు ఎసరు?

- అవిశ్వానికి పావులు కదుపుతున్న సొంత పార్టీ నేతలు
- అవిశ్వాసం నుంచి తప్పించుకునేందుకు ప్రయత్నాలు
- ఫిబ్రవరి నెలలో మలేషియా వెళ్లేందుకు ప్రణాళికలు

పావనీజంగయ్య





మాధవరెడ్డి



ఘట్‌కేసర్: ఘట్‌కేసర్ మున్సిపాలిటీ చైర్‌పర్సన్, వైస్ చైర్మన్‌పై సొంత పార్టీ కౌన్సిలర్లు అవిశ్వాసం పెట్టేందుకు పావులు కదుపుతున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఓడగానే సద్దుమణగాల్సింది పోయి మరింత వేగం పెంచారు. కాంగ్రెస్ కౌన్సిలర్లు అవిశ్వాసం పెట్టాల్సి ఉండగా.. చైర్ పర్సన్ ఒంటెద్దు పోకడలు పోతున్నారని ఆరోపిస్తూ సొంత పార్టీ కౌన్సిలర్లే ప్రణాళికలు రచిస్తున్నారు. ఇప్పటి వరకు చైర్ పర్సన్‌పైనే అనుకున్న అవిశ్వాసం కాస్తా అంతకంటే బలంగా వైస్ చైర్మన్‌పైకి మళ్లింది. అందులో సొంత పార్టీ కౌన్సిలర్లు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థికి మద్దతిస్తామని తెలపడంతో అవిశ్వాసం బలంగా కనిపిస్తోంది. మూడేళ్లు దాటగానే అవిశ్వాసం రాగమెత్తిన బీఆర్ఎస్ కౌన్సిలర్లు మాజీ మంత్రి, ఎమ్మెల్యే మల్లారెడ్డి ఆదేశానుసారం అప్పట్లో మిన్నకుండిపోయారు. జనవరితో మున్సిపల్ పాలకవర్గం నాలుగేళ్లు పూర్తి కానున్న నేపథ్యంలో కాంగ్రెస్‌కు మద్దతిచ్చి ఎలాగైనా గద్దెదించాలని అసంతృప్తులు కొత్తరాగం ఎత్తుతున్నారని సమాచారం. ఇతంతా ఉట్టి బెదిరింపులేనని, చూస్తూ కావాలని చైర్ పర్సన్ సీటును కాంగ్రెస్‌కు అప్పగించరని ప్రజలు అంటున్నారు.

మారిన సమీకరణాలు..

మున్సిపాలిటీలోని 18 వార్డులకు 2020 జనవరిలో జరిగిన ఎన్నికల్లో అప్పటి అధికార పార్టీ బీఆర్ఎస్ 10 వార్డులు గెలుచుకోగా, కాంగ్రెస్ అభ్యర్థులు 4 వార్డులు, ఇండిపెండెంట్లు నలుగురు విజయం సాధించారు. ఎన్నికల అనంతరం ఒక ఇండిపెండెంట్, కోఆప్షన్ ఎన్నికల సమయంలో ఇద్దరు కాంగ్రెస్, ఇద్దరు ఇండిపెండెంట్లు బీఆర్ఎస్‌లో చేరారు. మల్కాజ్‌గిరి ఎంపీగా ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి గెలవగానే మిగిలిన ఇద్దరు కాంగ్రెస్ కౌన్సిలర్లు మాజీ మంత్రి అండతో అధికార బీఆర్ఎస్‌లో చేరడంతో మెజారిటీ 17కు చేరుకోగా ఒకరు ఇండిపెండెంటుగా ఉన్నారు. మొన్న జరిగిన ఎమ్మెల్యే ఎన్నికలకు ముందు బీఆర్ఎస్ గుర్తుపై గెలిచిన ముగ్గురు కౌన్సిలర్లు, కాంగ్రెస్ గుర్తుపై గెలిచిన ఇద్దరు, ఒక ఇండిపెండెంట్ తిరిగి కాంగ్రెస్‌లో చేరడంతో బీఆర్ఎస్ మెజారిటీ 11కు తగ్గింది. జనవరితో అవిశ్వాసం తీర్మానం పెట్టేందుకు అవకాశం ఉండటంతో రాజకీయ వాతావరణం వేడెక్కింది.

సొంత పార్టీ వారి వెన్నుపోటు..

గతంలో పదవి కోసం ప్రయత్నించి విఫలమైన వారు తిరిగి ప్రయత్నాలు ప్రారంభించారు. బీఆర్ఎస్‌కు చెందిన మెజారిటీ కౌన్సిలర్లం మద్దతిస్తాం, చైర్ పర్సన్‌పై అవిశ్వాసానికి సిద్ధం కావాలని ఓ బీఆర్ఎస్ ప్రముఖ నాయకుడు కాంగ్రెస్‌లో చేరిన కౌన్సిలర్‌కు ఆఫర్ ఇచ్చినట్లు ప్రచారం జరుగుతోంది. ఆ కౌన్సిలర్ కూడా గతంలో చైర్ పర్సన్ సీటు ఆశించిన వారు కావడం విశేషం. ఇటీవల ఘట్‌కేసర్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే ఆ కౌన్సిలర్‌ను ఆశీర్వదించినట్లు బీఆర్ఎస్ నాయకులే అంటున్నారు. ఎవరైనా బీఆర్ఎస్ అభ్యర్థే చైర్ పర్సన్‌గా ఉండాలని అన్నట్లు మరో ప్రచారం జరుగుతోంది.

వైస్ చైర్మన్‌ను వదలం..

ఇటీవల ఓ కౌన్సిలర్ ఇంట్లో మంతనాలు జరిపి వైస్ చైర్మన్‌ను కూడా పదవి నుంచి తప్పించాలని చర్చించుకున్నట్లు తెలుస్తోంది. మెజారిటీ కౌన్సిలర్లు కూడా వైస్ చైర్మన్‌పై అవిశ్వాసానికి సిద్ధంగా ఉన్నామన్నట్లు వినికిడి. ఇద్దరిపై అవిశ్వాసం పెట్టి తొలగించాలని వ్యవహారం నడిపిస్తున్నారు. చైర్ పర్సన్‌పై అవిశ్వాసానికి మెజారిటీ కౌన్సిలర్లు సిద్ధంగా లేమని, వైస్ చైర్మన్‌పై అవిశ్వాసం సరేనని అంటున్నారు.

ఆర్థికంగా లబ్ధిపొందాలని అవిశ్వాసం..

అవిశ్వాసం నెగ్గదని తెలిసినా ఆర్థికంగా లాభపడాలని తెరపైకి తెస్తున్నట్లు కొందరు కౌన్సిలర్లు అంటున్నారు. ఈ నేపథ్యంలో ఘట్‌కేసర్ గుట్టుమైసమ్మ అమ్మవారి జాతర ఈ నెల 28న జరగాల్సి ఉన్నందున ఫిబ్రవరి 3 తర్వాత మెజారిటీ కౌన్సిలర్లతో మలేషియా వెళ్లేందుకు ప్రణాళికలు రచిస్తున్నారు. ఇదంతా చైర్ పర్సన్, వైస్ చైర్మన్ నుంచి లబ్ధిపొందడానికి ఆడుతున్న నాటకమని, గతంలో పదవులు ఆశించి భంగపడ్డవారే తెరచాటున ఉండి తతంగం నడిపిస్తున్నారని ప్రజలు అంటున్నారు.

అవిశ్వాసానికి కావాల్సింది 14 మంది కౌన్సిలర్లు..

ప్రస్తుతం కౌన్సిల్‌లో 11 మంది బీఆర్ఎస్, ఆరుగురు కాంగ్రెస్, ఒక ఇండిపెండెంట్ కౌన్సిలర్ ఉన్నారు. అవిశ్వాసం పెట్టాలంటే 14 మంది కౌన్సిలర్ల సంతకం అవసరం కాగా, పదవులు కాపాడుకోవాలంటే 10 మంది కౌన్సిలర్ల బలం ఉండే చాలు. కౌన్సిల్ పదవి కాలం ఉన్నది ఏడాదైనా ఆర్థిక భారం భరించేవారెవరు, మద్దతు ఇచ్చేవారెవరో తెలియని అయోమయ స్థితిలో అవిశ్వాసముంది. ఏదిఏమైనా చైర్ పర్సన్, వైస్ చైర్మన్‌పై అవిశ్వాసం నాటకమా, ఆర్థిక కోణమా, నిజంగా గద్దెదించుతారా అన్నది ఫిబ్రవరి మొదటి వారంలో తేలనుంది. అప్పటి వరకు వేచిచూడాల్సిందే.

ఎన్ఎస్ఎస్ వలంటీర్లకు అభినందనలు



ఘట్‌కేసర్: మహారాష్ట్రలో జరగనున్న 27వ నేషనల్ యూత్ ఫెస్టివల్‌కు వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ వలంటీర్లు అనీశ్ చంద్ర, సౌమ్య నాశిక్ ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ యూనివర్సిటీ కోఆర్డినేటర్ డాక్టర్ మల్లేశ్, ఇంజినీరింగ్ డీన్ విజయకుమార్ ఆధ్వర్యంలో క్యాంపస్‌లో బుధవారం అభినందన సభ ఏర్పాటు చేసి సత్కరించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ అధికారులు కిరణ్‌కుమార్, చిన్న శ్రీనివాస్ రావు, వలంటీర్లు పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లో ప్రజాపాలన దరఖాస్తులు



దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియను పరిశీలిస్తున్న కమిషనర్ వేమనరెడ్డి

పోచారం: అభయహస్తం ప్రజాపాలన కార్యక్రమంలో ప్రజల నుంచి స్వీకరించిన దరఖాస్తులను ఆన్‌లైన్‌లో చేరుస్తున్నారు. పోచారం మున్సిపల్ కార్యాలయంలో జరుగుతున్న ఈ ప్రక్రియను కమిషనర్ వేమనరెడ్డి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దరఖాస్తుల డేటా ఎంట్రీలో ఎలాంటి పొరపాట్లు దొర్లకుండా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఆన్‌లైన్ ప్రక్రియకు ఏఈ నరేష్ కుమార్ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నట్లు చెప్పారు.

నెలాఖరులోగా సీఎంఆర్ పూర్తి చేయాలి

జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి



సాక్షి, మేడ్చల్ జిల్లా: మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని రైస్ మిల్లులను బుధవారం అడిషనల్ కలెక్టర్ డి.విజయేందర్ రెడ్డి పౌరసరఫరాల అధికారులతో కలిసి తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా గోదాముల్లో నిల్వ, సీఎంఆర్ వివరాలతో సహా బకాయిలకు సంబంధించిన రికార్డులను ఆయన పరిశీలించారు. అలాగే బియ్యం నాణ్యతను పరిశీలించారు. ఈ నెలాఖరులోగా బకాయిలు ఉన్న వారు సత్వరమే సీఎంఆర్ పూర్తి చేయాలని ఆదేశించారు. రైస్ మిల్లర్ల యజమానులు రోజువారి లక్ష్యాన్ని పూర్తి చేయడంపై దృష్టి సారించాలని ఆదేశించారు. లేదంటే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ జి.రాజేందర్ పాల్గొన్నారు.

ధర్నాకు సింగరేణి విశ్రాంత ఉద్యోగులు తరలిరావాలి

కీసర: సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఈ నెల 22న కొత్తగూడెంలోని సింగరేణి కాలరీస్ కంపెనీ హెడ్ ఆఫీస్ ఎదుట నిర్వహించే ధర్నాకు పెద్ద ఎత్తున సింగరేణి విశ్రాంత ఉద్యోగులు తరలిరావాలని దమ్మాయిగూడ మున్సిపల్ సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు దండంరాజ్ రాంచందర్‌రావు కోరారు. దమ్మాయిగూడలో నిర్వహించిన సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘం కార్యవర్గ సమావేశం ఆదివారం నిర్వహించారు. డిమాండ్ల సాధన కోసం ధర్నా చేపడుతున్నట్లు వారు తెలిపారు.

సంఘం ఉపాధ్యక్షులు బీరయ్య, ప్రధాన కార్యదర్శి వేణుమాధవ్, నర్సింగ్ రావు, కనకయ్య, ఉమాకర్, లక్ష్మీనారాయణ, రాజనర్సు, జయంత్‌కుమార్, సమ్మయ్య, రాజేశం, తదితరులు పాల్గొన్నారు.

హిట్‌రన్ చట్టాన్ని రద్దు చేయాలని లారీ డ్రైవర్ల ధర్నా



కీసర: కేంద్ర ప్రభుత్వం ఇటీవల కొత్తగా తీసుకువచ్చిన హిట్ రన్ చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం కీసర రింగ్ రోడ్డు వద్ద ట్రక్కు డ్రైవర్లు ధర్నాకు దిగారు. దీంతో సుమారు రెండు కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్ అయ్యింది. పలువురు లారీ, ట్రక్కు డ్రైవర్లు మాట్లాడుతూ హిట్‌రన్ చట్టంతో లారీ డ్రైవర్లకు ఇబ్బందులు ఉంటాయని, అనుకోకుండా ప్రమాదాలు జరిగితే లారీ డ్రైవర్లకు 10 ఏళ్ల జైలుశిక్ష, తదితర నియమాలు చట్టంలో పొందుపర్చడంతో లారీ డ్రైవర్లకు ఇక్కట్లు తప్పవన్నారు. విషయం తెలుసుకున్న సీఐ వెంకటయ్య ఆధ్వర్యంలో కీసర పోలీసులు ధర్నాకు దిగిన లారీ డ్రైవర్ల యూనియన్ నాయకులను పోలీస్ స్టేషన్‌కు తరలించి ట్రాఫిక్‌ను పున:రుద్ధరించారు.

వాటర్ ప్లాంట్ తొలగించాలని ధర్నా



కాప్రా: ఆదిత్యనగర్‌లో వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసి చట్టవిరుద్ధంగా ట్యాంకర్ల ద్వారా నీటిని విక్రయిస్తున్నారని ఆరోపిస్తూ ధర్నా నిర్వహించారు. ఇప్పటికే ఈ ప్రాంతంలో భూగర్భ జలాలు అడుగంటి కాలనీవాసులకు నీటి కొరత ఉందని, దానికి తోడు ఇలా బోరు ద్వారా నీటిని తోడి ట్యాంకర్ల ద్వారా విక్రయిస్తూ ఇతరులకు నీటిని అందుబాటులో లేకుండా చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే సంబంధిత అధికారులు ఈ ప్లాంట్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు నాగిరెడ్డి సంజీవరెడ్డి, సెక్రటరీ శేషం, రామాచారి, కాలనీవాసులు మయూరి సురేష్, కోల రాజు, ప్రసాద్, సాంబశివరావు, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ శ్రీరాముడి అక్షింతలు

కాప్రా: అయోధ్యలో ఈ నెల 22న బాలరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ సందర్భంగా శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్ట్ అయోధ్యలో ప్రత్యేక పూజలు చేసిన అక్షింతలు కాప్రా సర్కిల్‌కు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ఏఎస్‌రావునగర్ డివిజన్‌లో శోభాయాత్రగా అయోధ్య రాముడి అక్షింతలు పంపిణీ ప్రారంభించారు. ఏఎస్‌రావు నగర్ హనుమాన్ ఆలయం నుంచి ప్రారంభమైన శోభాయాత్ర శారద థియేటర్, హైటెన్షన్ రోడ్, మహేష్‌నగర్, కమలానగర్ వరకు కొనసాగింది. శోభాయాత్ర ద్వారా ఇంటింటికీ రాములోరి అక్షింతలు అందజేస్తూ వాటి గురించి ప్రజలకు అవగాహన కల్పిస్తూ ముందుకు సాగారు. కార్యక్రమంలో ఆర్గనైజర్లు కిషోర్ రామసాగర్, ప్రభాకర్‌రెడ్డి, సోమేష్ నాయుడు, సందీప్ పరికిబాండ, సురేష్ ధరమ్‌కర్, స్థానికులు రమేష్ యాదవ్, కుంతల కిరణ్, మోహన్‌రెడ్డి, రూపరెడ్డి, పాపిరెడ్డి, అనిల్, వెంకటాచలం, శ్రీధర్, చిత్తారి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన వజ్రేష్‌యాదవ్



మేడ్చల్: సీఎం రేవంత్‌రెడ్డిని మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్‌యాదవ్ కలిశారు. నియోజకవర్గ నాయకులతో కలిసి ఆయన సీఎం కార్యాలయానికి వెళ్లి కలిశారు. ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, స్పీకర్ ప్రసాద్‌కుమార్‌ను ఆయన కలిశారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన



కీసర: చీర్యాల గ్రామంలో బుధవారం ఆర్‌వీఎం ఆస్పత్రి ఆధ్వర్యంలో నిర్వహించి ఉచిత వైద్య శిబిరానికి ప్రజల నుంచి స్పందన లభించింది. వైద్య శిబిరంలో ఉచితంగా వివిధ వైద్య పరీక్షలు నిర్వహించి ప్రజలు, పాఠశాలలకు చెందిన విద్యార్థులకు ఉచితంగా మందులను పంపిణీ చేశారు.

విద్యార్థులకు వ్యాయామం నేర్పించాలి



అవుషాపూర్‌లో కబడ్డీ ఆడుతున్న విద్యార్థులు

ఘట్‌కేసర్: పాఠశాలల్లో చదువుతో పాటు విద్యార్థులకు వ్యాయామం తప్పనిసరిగా నేర్పించాలని సర్పంచ్ కావేరి అన్నారు. అవుషాపూర్ జెడ్పీ స్కూల్‌లో స్పోర్ట్స్ డేను బుధవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ క్రీడలతో విద్యార్థులు శారీరకంగా, మానసికంగా అభివృద్ధి చెందుతారన్నారు. అనంతరం విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో నాయకులు మహేందర్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయుడు రవి, ఉపాధ్యాయులు శైలజ, కార్మేల్, విశ్వశాంతి, విద్యార్థులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం



కావ్య(ఫైల్)

జవహర్‌నగర్: యువతి అదృశ్యమైన ఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. అంబేడ్కర్‌నగర్‌లో నివసించే మాలి శ్రీనివాస్‌రెడ్డి కుమార్తె మాలి కావ్య(22) ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తోంది. మంగళవారం పనికి వెళ్లి వచ్చి కుటుంబసభ్యులతో కలిసి నిద్రపోయింది. బుధవారం ఉదయం కుటుంబసభ్యులు లేచి చూడగా ఆమె కనిపించలేదు. ఆచూకీ కోసం తెలిసిన చోట్ల వెతికినా లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మండల అభివృద్ధికి సహకారం అందిస్తా

జెడ్పీ చైర్మన్ శరత్‌చంద్రారెడ్డి



మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ శరత్‌చంద్రారెడ్డి

శామీర్‌పేట్: శామీర్‌పేట మండలంలోని గ్రామాల అభివృద్ధికి సహకారం అందిస్తానని మేడ్చల్ జెడ్పీ చైర్మన్ శరత్‌చంద్రారెడ్డి అన్నారు. శామీర్‌పేట ఎంపీపీ యెల్లుబాయి అధ్యక్షతన బుధవారం శామీర్‌పేట మండల సాధారణ సర్వసభ్య సమావేశం జరిగింది. జెడ్పీ చైర్మన్ శరత్‌చంద్రారెడ్డి హాజరై సభ్యులు లేవనెత్తిన సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

సభలో సభ్యులు లేవనెత్తిన పలు అంశాలు..

శామీర్‌పేట గ్రామంలో అద్దె భవనంలో కొనసాగుతున్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని తహసీల్దార్ కార్యాలయ ఆవరణలోకి మార్చాలని సభ్యులు ఏకగ్రీవ తీర్మానాన్ని సభలో ప్రవేశపెట్టారు. తద్వారా మండల పరిషత్ కార్యాలయానికి చెందిన షెటర్ల వల్ల ఆదాయం వస్తుందని వివరించారు. మండలంలోని పలు గ్రామాల్లోని అక్రమ వెంచర్లపై చర్యలు తీసుకోవాలని పలుమార్లు ఎంపీపీ యెల్లుబాయి దృష్టికి తీసుకువచ్చినా ఫలితం లేదని జెడ్పీ చైర్మన్‌కు సభ్యులు వివరించారు. మిషన్ భగీరథ వాటర్ ట్యాంక్‌ల కింద కట్టడాలు చేపడుతున్నారని, వాటిని తొలగించాలని సభ ద్వారా సంబంధిత అధికారులకు సూచించారు. మండల స్థాయిలో జరిగే ఎలాంటి సమావేశానికి తహసీల్దార్ హాజరు కావడం లేదని, రెవెన్యూ సమస్యలను ఎవరి దృష్టికి తీసుకువెళ్లాలో అర్థం కావడం లేదని సభ్యులు అసహనం వ్యక్తం చేశారు. సమావేశంలో ఎంపీటీసీ సభ్యులు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలతో అనర్థాలెన్నో..

ఇన్‌స్పెక్టర్ సీతారాం

జవహర్‌నగర్: విద్యార్థులు బాల్యం నుంచే సామాజిక దృక్పథం అలవర్చుకోవాలని, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ సీతారాం పిలుపునిచ్చారు. జవహర్‌నగర్ కార్పొరేషన్‌లోని బాలాజీనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఇన్‌స్పెక్టర్ సీతారాం ఆధ్వర్యంలో డ్రగ్స్‌తో కలిగే అనర్థాలు, లైంగిక వేధింపులు తదితర విషయాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో ప్రావీణ్యం సాధించాలన్నారు. బాల్య వివాహాలను నివారించాలని, మత్తు పదార్థాలు వాడితే అనర్థాల గురించి వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎక్స్‌పీరియన్షల్ లెర్నింగ్‌పై అవగాహన



చిత్రలేఖనంపై పోటీలు నిర్వహించి బహుమతులు అందజేస్తూ..

కీసర: రాంపల్లి రెవెన్యూ పరిధిలోని జూబ్లీహిల్స్ స్కూల్ ఉపాధ్యాయుల బృందం సింగపూర్ టౌన్‌షిప్ పరిసర ప్రాంతంలో బుధవారం పర్యటించారు. విద్యారంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా ఎక్స్‌పీరియన్షల్ లెర్నింగ్ పద్ధతిలో బోధనపై విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఆయా ప్రాంతాలను సందర్శించి క్రీడలు, చిత్రలేఖనం, గానం, నృత్యం వంటి తదితర అంశాల్లో విద్యార్థులు, తల్లిదండ్రులకు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్ రాంపల్లి చైర్మన్ హరిశ్చంద్ర ప్రసాద్, పిన్సిపాల్ సుచరితరాయ్, ప్రాజెక్ట్ డైరెక్టర్ ప్రమోద్ శామ్‌జోయిస్ తదితరులు ఉపాధ్యాయుల బృందాన్ని అభినందించారు.

ప్రతి ఒక్కరికీ వైద్య సేవలు అందాలి

బోడుప్పల్: సమాజంలో ప్రతి ఒక్కరికీ వైద్య సేవలు అందాల్సిన అవసరం ఉందని అనఘాపురి కాలనీ అధ్యక్షుడు జయపాల్‌రెడ్డి అన్నారు. అభయ మల్టీ స్పెషాలిటీ ట్రస్ట్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో అనఘాపురి కాలనీలో బుధవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందాల్సిన అవసరం ఉందన్నారు. బస్తీల్లో ఇలాంటి వైద్య సేవలు అందించడం ద్వారా హాస్పిటల్‌కు వెళ్లలేని వారికి ఎంతో మేలు జరుగుతుందన్నారు. వైద్య శిబిరంలో షుగర్, బీపీ, కంటి పరీక్షలు నిర్వహించారు. జనహిత సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో అవసరమైన వారికి ఉచితంగా మందులను అందజేశారు. కార్యక్రమంలో అభయ హాస్పిటల్ వైద్యులు క్రాంతి, క్యాంపు కో ఆర్డినేటర్ జహంగీర్, సిబ్బంది సునీత, శైలజ పాల్గొన్నారు.

